క్లుప్తంగా

ఓటర్ల జాబితాపై సర్వే



గజపతినగరంలో సర్వే చేస్తున్న తహసీల్దార్ అరుణకుమారి, ఎలక్షన్ డీటీ సతీష్ కుమార్

గజపతినగరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాపై మండలంలో ఇంటింట సర్వే కొనసాగుతోంది. తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్ మండల కేంద్రంలో సోమవారం ఇంటింట సర్వే చేశారు. ఓటర్ల వివరాలు, డోర్ నంబర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు జాబితాలో సరిపోయాయా లేదా పరిశీలించారు. జాబితాలో తప్పులు ఉన్నా, ఏమైనా అభ్యంతరాలు ఉన్నా చెప్పాలని అధికారులు ఓటర్లను కోరారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

మెరకముడిదాం: మండలంలోని అన్ని పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు ఆ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వారీగా రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. అలాగే జాబ్‌కార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి 100 రోజులు పనిదినాలు పూర్తయిన వేతనదారుల వివరాలను నమోదు చేయాలని క్షేసూచించారు.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా లక్ష్మణరావు



లక్ష్మణరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా చినకాద ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణ రావును ఆశాఖ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇది వరకు ఉన్న అధ్యక్షుడికి వేరే మండలానికి బదిలీ కావడంతో నూతన అధ్యక్షుడి కోసం పెదమానాపురం ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా లక్ష్మణరావును ఎన్నుకున్నామని ఆశాఖ మండల కోశాధికారి శంకరరావు తెలిపారు. ఉపాధ్యాయులు జగదీష్, పరుశరాం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

కొత్తవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వ సభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

నిరసన

జామి: భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీని ప్రభుత్వం తక్షణమే తెరిపించి, రైతులను ఆదుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద సోమవారం నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ చైర్మన్ అయిన జేసీ రైతులతో తక్షణమే సమావేశం నిర్వహించాలని, రైతు మహాజనసభపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కర్మాగారానికి నిధులు మంజూరు చేసి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సీపీఐ రాష్ట్ర నాయకుడు కామేశ్వరరావు, టీడీపీ, జనసేన, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీడీఓ

గజపతినగరం: ప్రజాసమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. కొత్తబగ్గాం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి కొత్త రేషన్ కార్డు కోసం, పలువురు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

రామాచార్యులకు జ్యోతిషరత్న బిరుదు

విజయనగరం టౌన్: పట్టణంలోని దాసన్నపేటలో కొలువైన చిన్న ఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ ఆరవెల్లి రామాచార్యులకు జ్యోతిష్య రత్న బిరుదు వరించింది. విశాఖలో ఆదివారం రాత్రి నిర్వహించిన వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో జ్యోతిష్య పురోహిత అర్చక రంగంలో విశేష కృషిచేస్తున్నందుకు గాను రామాచార్యులను దుశ్శాలువ, జ్ఞాపికతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు చేతుల మీదుగా సత్కారం అందుకోవడం ఆనందంగా ఉందని రామాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్య, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి

- ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో నూతన భవనాల ప్రారంభం
- హాజరైన ఎంపీ సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు



బ్లడ్‌బ్యాంక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యనారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, జగన్నాథం

శృంగవరపుకోట: విద్య, వైద్య రంగాలపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారని విశాఖపట్నం ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని మొదటి అంతస్తులో రక్తనిల్వ కేంద్రం, నవజాత శిశు సంరక్షణా కేంద్రం కోసం నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథంతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులను సమగ్రంగా అభివృద్ధి చేసి కార్పొరేట్ ఆస్పత్రుల కు తగ్గట్టుగా తయారు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. స్థానిక ఆస్పత్రిలో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధి కోసం సీఎం జగన్ వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఎస్.కోట ఆస్పత్రి అభివృద్ధికి రూ.12.60 కోట్లు మంజూరు చేయడంతో పాటు పూర్తి స్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించిన సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడు తూ ఎస్.కోట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెంచడం ఆనందంగా ఉందని అన్నారు. డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో నూతన భవనాలు సిద్ధమవుతాయని అధికారులు చెబుతున్నారని, పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు పి.వెంకటరమణ, సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ డి.సంతోషకుమారి, ఎంపీటీసీ ఆర్.ధారగిరి, వార్డు సభ్యుడు పి.సంతోష్, డీసీహెచ్ డాక్టర్ బి.గౌరీశంకరరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ వి.చిట్టిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.నీల తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమకారుడు జాషువా



వేపాడ: మోడల్ స్కూల్‌లో జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జాషువా జీవిత విశేషాలను వివరిస్తున్న లెక్చరర్ శ్రీలక్ష్మి

వేపాడ: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సామాజిక ఉద్యమకారుడని, తన కవితలనే ఆయుధాలుగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డారని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు అన్నారు. బక్కునాయుడుపేట వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో జాషువా వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కులం కట్టుబాట్లుకు లొంగని విశ్వనరుడు

శృంగవరపుకోట: గుర్రం జాషువా కులం కట్టుబాట్లకి లొంగని విశ్వనరుడని, ఛీత్కారాలు ఎదురైన చోట సత్కారాలు పొందిన గొప్ప కవి అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు అన్నారు. జాషువా వర్ధంతిని కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గుర్రం జాషువా తన కవిత్వంతో సమాజంలో మూడాచారాలను నిరసించారన్నారు. తెలుగు శాఖ అధ్యక్షురాలు ఆర్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ జాషువా క్రీస్తు చరిత్ర, గబ్బిలం, ముసాఫర్లు, స్వప్నకథ వంటి రచనలతో నవయుగ కవి చక్రవర్తిగా సాహితీ లోకంలో అజరామరమైన కీర్తి గడించారని అన్నారు.

విజయ గణపతికి ప్రత్యేక పూజలు



విజయగణపతికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో విజయగణపతికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు చైతన్య , శ్రీహర్ష ఆధ్వర్యంలో విజయ గణపతికి పంచామృతాభిషేకాలు, స్నపనం, అర్చన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్ దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ పాల్గొన్నారు

సాగునీటి కాలువను పునరుద్ధరించరూ..



హైవే పనుల్లో భాగంగా సాగునీటి కాలువను పూడ్చివేయడంతో కొండతామరపల్లి వద్ద నీట మునిగిన పంట పొలాలు



మూడు అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేసిన మట్టి కాలువ

గంట్యాడ: మండలంలోని కొండతామరపల్లి వద్ద జాతీయ రహదారి-516 విస్తరణ పనుల్లో భాగంగా పూడ్చేసిన సాగునీటి కాలువను పునరుద్ధరించా లని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు. తాటిపూడి జలాశయం నుంచి కొండతామరపల్లికి సాగునీటిని అందించే 15 అడుగుల వెడల్పు గల కాలువను హైవే విస్తరణలో భాగంగా తామరపల్లి బంగ్లా వద్ద కప్పేశారు. ఈ కాలువ పొలాలకు సాగునీరు అందించడంతో పాటు వరదనీటిని పొలాల నుంచి దిగువకు పంపించేందుకు ఉపయోగపడేది. కాలువ లేక పోవడంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు బయటకు వెళ్లే మార్గం లేక పొలాలు నీటమునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతకాలువ పక్కనే కొత్తగా సీసీ కాలువను నిర్మించాలని హైవే పనులు దక్కించుకున్న సంస్థను కోరినా తమగోడు పట్టించుకోలేదని రైతులు చెబుతున్నారు. కాలువ లేక పోవడం వల్ల వర్షపు నీటితో పంట పొలాలు మునగడంతో పాటు సమీపంలోని ఇళ్లలోకి కూడా నీరు చేరుతోందని వారు వాపోతున్నారు. సమస్యను మంత్రి బొత్ససత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి తీసుకువెళ్లామని, వారి ఆదేశాలతో హైవే ప్రాజెక్టు అధికారి, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారి కాలువను పూడ్చేసిన స్థలాన్ని పరిశీలించారని గ్రామస్తులు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా కాలువ నిర్మించాలని హైవే పనులు దక్కించుకున్న సంస్థకు అధికారులు సూచించడంతో ఆ మరుసటి రోజే మూడు అడుగుల కాలువ తవ్వారని, ఇది ఏమాత్రం వరదనీరు, సాగునీటి పారుదలకు సరిపోవడం లేదని రైతులు అంటున్నారు. తొమ్మిది అడుగుల వెడల్పుతో సీసీ కాలువ నిర్మించాలని రైతులు కె.మహేష్, బి. ఎర్నాయుడు, ఎల్. దేవుడు. వై.నాగరాజు, పి.సత్యం తదితరులు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు కడుబండి, అప్పలనరసయ్య



వేపాడ: శింగరాయిలో మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వేపాడ: ప్రజాసంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శింగరాయి గ్రామంలో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు స్థానిక సర్పంచ్ నిరుజోగి వెంకటరావు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే వర్షంలో సైతం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడాలనే లక్ష్యంతో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు అందిస్తున్నామని తెలిపారు. పేదలకు పథకాలు అందుతుంటే చూసి తట్టుకోలేని విపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు వాస్తవాన్ని గుర్తించి జగనన్న ప్రభుత్వంలో లబ్ధి చేకూరిందా లేదా అని ఆలోచించుకోవాలని హితువు పలికారు.ఎంపీపీ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సర్పంచ్ రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, ఎంపీటీసీలు టి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, నాయకులు బీల సతీష్, నిరుజోగి శ్రీను, దుల్ల సన్యాసిరావు ,కేదారి దొరబాబు, అప్పలనాయుడు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే..



దత్తిరాజేరు: పెదకాద గ్రామంలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. మండలంలోని పెదకాద గ్రామంలో సోమవారం ఉదయం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్ర మం నిర్వహించారు. స్థానిక, మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను ఆరాతీశారు. విద్యుత్ స్తంభాలు మార్చాలని, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అమలు చేసిన అరకొర పథకాలు సైతం అర్హులకు అందేవి కాదని, జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులకు లంచాలు ఇచ్చిన వారికే మంజూరు చేసేవారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఫార్సులు, లంచాలు అనే మాటలేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామవలంటీర్లు ప్రతీనెల ఒకటో తేదీ ఉదయాన్నే తలుపుతట్టి అవ్వాతాతలకు పింఛన్ అందజేస్తున్నారని, ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే అందుతున్నాయని, ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. స్థానిక ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముత్యాలనాయుడు, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, మండల జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, ఎంపీటీసీ నాగిరెడ్డి సత్యం, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, నాయకులు కుమార్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలం నాయుడు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. శాఖల వారీగా ప్రగతి, సమస్యలపై అధికారులతో సమీక్షించారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ గ్రామాల్లో సమస్యలను అధికారులకు వివరించారు. నెలివాడ గ్రామంలో ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ తీగలను మార్చడానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈఈ శంకరరా వును ఆ గ్రామ సర్పంచ్ తాళ్లపూడి కీర్తి కోరారు. ఒంపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని, మళ్లీ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలని గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ కోరారు. వేంద్రాంలో రైతులు తరతరాలుగా సాగుచేస్తున్న ఈనాం భూములకు సంబంధించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు కోరారు.

ఓటర్ల సర్వేను పర్యవేక్షించాలి

ఓటర్ల జాబితాపై బీఎల్‌ఓలు (బూత్ లెవెల్ ఆఫీసర్లు) చేపడుతున్న ఇంటింట సర్వేను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ లెవల్ నాయకులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే అప్పలనరసయ్య సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పుగా నమోదైనా, డోర్ నంబర్ లేకపోయినా సరిచేయించాలని చెప్పారు. అలాగే 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండే వారందరితో ఓటు హక్కుకు నమోదు చేయించాలని సూచించారు. ప్రతి సచివాలయం పరిధిలో బల్క్‌మిల్క్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. మండలానికి 16 బల్క్‌మిల్క్ కేంద్రాలు మంజూరు కాగా మూడు చోట్ల మాత్రమే భవన నిర్మాణాలు చేపడుతున్నారని, మిగతా చోట కూడా నిర్మాణాలను ప్రారంభించాలని కోరారు. వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌ల భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, తహసీల్దార్ డి.జి.ఎం.ఎస్. ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక పరివర్తనతో ఉన్నత జీవితం



మిషన్ మెడిటేషన్ కార్డులు ఆవిష్కరిస్తున్న బ్రహ్మకుమారీలు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

చీపురుపల్లి: మానసిక పరివర్తన కలిగి ఉన్నవారే ఉన్నతమైన జీవితాన్ని గడుపుతారని బ్రహ్మకుమారీల చీపురుపల్లి, గరివిడి సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు శాంతి, హేమలత అన్నారు. కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వశాఖ, బ్రహ్మకుమారీస్ యూత్‌వింగ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వై-20 కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో సోమవారం సెమినార్, టాక్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యసనరహిత జీవనశైలిని విద్యార్థులు, యువత అలవాటు చేసుకోవాలన్నారు. డిజిటల్ పరికరాలతో ఎంతో మంచి ఉన్నప్పటికీ, అంతే అనర్థాలు కూడా ఉన్నాయని హెచ్చరించారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధన కోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. రాజయోగ మెడిటేషన్ ద్వారా మానసికంగా ధృడంగా ఉండవచ్చని, ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోవిందరావు, భౌతికశాస్త్ర అధ్యాపకుడు ప్రసాదరావు, బ్రహ్మకుమారీలు వైష్ణవి, నిర్మల, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు



చీపురుపల్లి సచివాలయం-4లో మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, అధికారులు

చీపురుపల్లి: 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని సచివాలయం-3, 4లలో సోమవారం 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో అవసరమైన వారికి కుల, ఆదాయ, జనన, మరణ, భూహక్కు తదితర 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన పనిలేకుండా, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు చెప్పారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, సువ్వాడ అప్పలనాయుడు, ముల్లు పైడిరాజు, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

కొత్తవలసలో సచివాలయ భవనం ప్రారంభం

కొత్తవలస: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-4 నూతన భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించనున్నారని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్.స్వామినాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు హాజరకానున్నారని, మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

జగనన్న సురక్ష

బొండపల్లి/ గజపతినగరం రూరల్: బొండపల్లి మండలంలోని దేవుపల్లి,గొల్లుపాలెం, గజపతినగరం మండలంలోని ముచ్చర్ల, లోగిశ గ్రామాల్లో మంగళవారం 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు వై.వి.రాజేంద్ర ప్రసాద్, కిశోర్‌కుమార్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రజలకు 11రకాల ధ్రువపత్రాలను అందజేయనున్నామని, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

మజ్జిపేట,గొభ్యాంలో 'గడప గడపకు'

దత్తిరాజేరు: మండలంలోని మజ్జిపేట, గొభ్యాం గ్రామాల్లో మంగళవారం ఉదయం' గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని పథకాలు అందుతున్నాయా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగితెలుసుకోనున్నారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సంబంధిత సచివాలయాల సిబ్బంది హాజరు కావాలని కోరారు.